AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
25-6-2026 (Thursday) MAIN EDITION

## అయోధ్య ట్రస్ట్ వివాదం.. అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించి వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్‌ను వినేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసును అత్యవసరంగా లిస్ట్ చేయాలని న్యాయవాదులు కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించి.. ఈ విషయాన్ని జూన్ 29న ప్రస్తావించాలని సూచించింది. పిటిషన్‌లో ఎటువంటి లోపాలు లేకపోతే రిజిస్ట్రీ ఆ వివరాలను పరిశీలిస్తుందని కోర్టు పేర్కొంది.

## ఎబోలా ఎఫెక్ట్.. ఎయిర్ సువిధ పోర్టల్ పునఃప్రారంభం




**అక్షరటుడే,నేషనల్‌డెస్క్:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో, భారతదేశంలోకి వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులపై కేంద్ర ప్రభుత్వం నిఘాను కఠినతరం చేసింది. అప్రమత్తమైన అధికారులు, గతంలో ఉన్న 'ఎయిర్ సువిధ' పోర్టల్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించే ప్రయాణికులందరూ విమానం దిగకముందే తమ ఆరోగ్య వివరాలను 'ఎయిర్ సువిధ' ఆన్‌లైన్ పోర్టల్‌లో సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఉన్న పేపర్‌ఆధారిత విధానం స్థానంలో ఇప్పుడు డిజిటల్ పద్ధతిని ప్రవేశపెట్టారు.

## నల్లగొండకు 28న సీఎం రేవంత్..



అక్షరటుడే, నల్లగొండ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో జూన్ 28న పర్యటించనున్నారు. జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయడంలో భాగంగా సుమారు రూ. 13,000 కోట్ల భారీ బడ్జెట్‌తో చేపట్టనున్న ఆర్అండ్‌బీ 'హ్యామ్' రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను మంత్రి కోమటిరెడ్డి సమీక్షించారు.

## ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సీఎం విజయ్



అక్షరటుడే, చెన్నై: తమిళనాడు సీఎం, టీవీకే అధినేత విజయ్ పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు, సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాలను గెలుచుకుంటు న్నారు. రాష్ట్ర రవాణా సంస్థలను ఆధునీకరించే క్రమంలో, ప్రభుత్వం కొత్తగా 300 డీజిల్, సీఎన్జీ బస్సులను కొనుగోలు చేసింది.

## వెనిజులాలో భారీ భూకంపం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: దక్షిణ అమెరికా ఖండంలోని వెనిజులాలో భారీ భూకంపలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై ఒక భూకంపం తీవ్రత 7.2 గా నమోదు కాగా, మరో భూకంపం తీవ్రత 7.5 గా నమోదైంది. ఈ జంట విపత్తుతో నగరాల్లోని ఎత్తైన భవనాలు ఊగిపోయాయి, రహదారులు బీటలు వారాయి. ప్రాణభయంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

## నల్లాలకు మోటార్లు పెడుతున్నారా..

### షాక్ ఇస్తున్న అధికారులు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జల మండలి అధికారులు కఠిన చర్యలు అమలు చేస్తున్నారు. నీటిని వృథా చేసే వారికి భారీగా జరిమానా వేస్తున్నారు. అలాగే నల్లాలకు మోటార్లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. జల మండలి అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అక్రమంగా బిగించిన మోట్లార్లు స్వాధీనం చేసుకుంటున్నారు. నగరంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో గురువారం ఉదయం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రజల నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తూ.. నల్లాలకు అమర్చిన 11 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. పదేపదే ఈ నిబంధనను ఉల్లంఘించే వారిపై రూ.5వేల జరిమానా, మోటార్ల స్వాధీనం, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బాలకృష్ణ-కొరటాల సినిమా ప్రారంభం



**అక్షరటుడే, సినిమా డెస్క్:** బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సినిమా తీస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయింది. బాల య్య నటిస్తున్న ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్‌గా ఎన్‌బీకే 112 ఖరారు చేశారు. అమరావతిలోని పూజ కార్యక్రమాలో షూటింగ్ మొదలైంది. రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల బడ్జెట్‌తో సుధాకర్ చెరుకూరి ఈ మూవీని నిర్మిస్తు న్నారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానున్నట్లు సమాచారం.

### క్లాప్ కొట్టిన మంత్రి లోకేష్

బాలయ్య చిత్రానికి ఆయన అల్లుడు, మంత్రి నారా లోకేష్ క్లాప కొట్టారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్వీని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం బాలకృష్ణ ఓ డైలాగ్ చెప్పి అలరించాడు.

# ప్రారంభమైన ఎస్ఐఆర్

“ **రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభం అయింది. గురువారం ఉదయం నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ప్రారంభించారు. జూలై 24 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇందులో భాగంగా బీఎల్‌వోలు రాష్ట్రంలో ఉన్న 3,38,26,448 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వనున్నారు. ఈ పత్రాలను నింపి జూలై 24 వరకు తిరిగి వారికి అందజేయాల్సి ఉంటుంది.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




- ఇంటింటికి తిరుగుతున్న బీఎల్‌వోలు
- ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ
- జులై 24 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- అక్టోబర్ 1న తుది జాబితా

ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. దొంగ ఓట్లు, రెండు చోట్ల ఉన్న ఓట్లను ఈ ప్రక్రియ ద్వారా తొలగించనున్నారు. అంతేగాకుండా మృతి చెందిన వారి ఓట్లు కూడా తీసేస్తారు. దీంతో పాటు ఇతర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చి.. ఇక్కడ ఓటు హక్కు పొందిన వారిని కూడా తొలగిస్తారు. దీని కోసం 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రారంభమైంది.

### ఫామ్ నింపితేనే..

బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లనున్నారు. సగటున వెయ్యి మంది ఓటర్లకు ఒక బీఎల్‌వోను నియమించారు. వివరాల కోసం బీఎల్‌వోలు మూడు సార్లు ఇళ్లకు వెళ్లనున్నారు. వారు ఇచ్చే ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఇస్తేనే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉంటుంది. లేదంటే ఓటు హక్కు తొలగిస్తారు. ఎస్ఐఆర్ ప్రక్రియ జులై 24న ముగుస్తుంది. అనంతరం అదే నెల 31న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు.

### ఎలా నింపాలి

ఎన్యుమరేషన్ ఫారమ్‌లో మన వివరాలు ముద్రించి ఉంటాయి. వాటికి అదనంగా మరికొన్ని వివరాలు నింపాల్సి ఉంటుంది. తాజా ఫొటోను అతికించాలి. అంతేగాకుండా సదరు వ్యక్తికి 2002కు ముందే ఓటు హక్కు ఉంటే ఆ వివరాలు, ఓటరు కార్డు నంబర్, తండ్రి లేదా భర్త పేరు రాయాలి. ఒకవేళ 2002 తర్వాత ఓటు హక్కు పొందినట్లయితే 2002లో ఓటు హక్కు ఉన్న కుటుంబ సభ్యుల పేరు రాయాలి. తల్లి, తండ్రి, తాత ఇలా ఎవరిదో ఒకరి పేరు, వారి ఓటరు ఐడీ నంబర్ నింపాలి. అనంతరం దానిని బీఎల్‌వోలు తిరిగి ఇవ్వాలి.

### పరిశీలించిన మంత్రి పొన్నం

ఎస్ఐఆర్ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్ నగర్ డివిజన్ వేల్కోటి పార్క్‌లో బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. 2002,2025 ఓటరు జాబితా ఆధారంగా సవరణ ప్రక్రియ జరుగుతుంది అని ఆయన తెలిపారు. బీఎల్ఏలు నిర్లక్ష్యంగా ఉంటే ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని, సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## తుంగభద్ర 33 కొత్త క్రస్ట్ గేట్ల ప్రారంభం




**అక్షరటుడే, హైదరాబాద్ :** తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లను మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం ఉదయం ప్రారంభించారు. రూ.51 కోట్లతో రికార్డు స్థాయిలో ఆరు నెలల్లో 33 కొత్త క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేశారు. తుంగభద్ర ప్రాజెక్ట్ 19వ గేటు గతంలో కొట్టుకుపోయింది. దీంతో ఎన్‌డీఎస్‌ఏ అధికారులు డ్యామ్‌ను పరిశీలించారు. అన్ని గేట్లను మార్చాలని సూచించారు. ఎన్‌డీఎస్ఏ సూచన మేరకు అధికారులు ఆరు నెలల్లో 33 కొత్త క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేశారు. వీటిని గురువారం కర్ణాటక, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు డీకే శివకుమార్, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.

## కర్ణాటక ప్రాజెక్టులతో రాష్ట్రానికి నష్టం : కవిత




**అక్షరటుడే, హైదరాబాద్:** తుంగభద్రలో మన నీటి వాటాకు తూట్లు పొడిచే పనికి సీఎం రేవంత్ మద్దతు తెలుపుతు న్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఆర్డీఎస్ చుట్టు కర్ణాటక చేపట్టే ప్రాజెక్టులతో మనం నీటి హక్కును కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. మన హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి.. కర్ణాటక దోపిడీకి వంత పాడుతున్నారని విమర్శించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లి పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రాజెక్టులతో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆర్డీఎస్ ప్రాజెక్ట్ ఉమ్మడి మహబూబ్ నగర్‌కు ఉపయోగపడే ప్రాజెక్ట్ అని తెలిపారు.

## తగ్గిన ముడి చమురు ధరలు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో యుద్ధం ముగిసింది. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం ఖరారు కావడం, శాంతి చర్చలు కొనసాగుతుండడంతో ముడి చమురు ధరలు భారీగా దిగి వచ్చాయి. దీంతో ప్రపంచ దేశాలకు ఎంతో ఊరట లభించనుంది. హర్మూజ్ జలసంధి మీదుగా సముద్ర వాణిజ్యం పెరిగిందన్న వార్తల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక వారంలో 8 శాతానికి పైగా తగ్గి, యుద్ధానికి ముందు స్థాయి అయిన బ్యారెల్‌కు సుమారు 72 డాలర్ల వద్దకు చేరుకున్నాయి. 'బ్రెంట్ క్రూడ్ ఆయిల్' ధరలు గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో 8.5 శాతం తగ్గాయి. ఇంధన ధరలు ఒక నెలలో 24 శాతం, గత మూడు నెలల్లో 28 శాతం మేర తగ్గాయి.

## బేకరీలో అగ్నిప్రమాదం.. రూ.20 లక్షల ఆస్తి నష్టం




**అక్షరటుడే, ఆసిఫాబాద్:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి ఓ బేకరీలో మంటలు చెలరేగాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని బెంగుళూరు అయ్యంగార్ బేకరీలో ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బేకరీ యజమానులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అర్ధరాత్రి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

## 16 రాష్ట్రాల్లో సీబీఐ మెరుపు దాడులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ నేరాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఉక్కుపాదం మోపింది. సుప్రీంకోర్టు అధికారిక వెబ్ సైట్‌ను పోలిన నకిలీ వెబ్ సైట్‌ను సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న ముఠాల ఆటకట్టించేందుకు సీబీఐ భారీ ఆపరేషన్ చేపట్టింది. గురువారం ఉదయం నుంచి దేశంలోని 16 రాష్ట్రాల్లోని దాదాపు 80 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో సీబీఐ అధికారులు విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఇప్పటివరకు జరిగిన 200కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులతో ఈ ముఠాకు సంబంధం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## శివసేన (యూబీటీ) చీలికపై ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, ముంబై :** 'ఆపరేషన్ టైగర్' గురించి శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీలోని ఆరుగురు ఎంపీలు షిండే శివసేనలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఆపరేషన్ టైగర్ విజయవంతం అయిందని ఏక్‌నాథ్ షిండే ఇటీవల తెలిపారు. దీనిపై సంజయ్ రౌత్ గురువారం మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ తప్పుడు గణాంకాలను చెప్పలేదన్నారు. పార్టీ మారిన వారికి రాత్రిపూట రూ. 15 కోట్లు ఇచ్చారని, ఆ తర్వాత వారందరినీ జైపూర్‌కు తరలించి, మళ్లీ రూ. 10 కోట్లు ఇచ్చారన్నారు. ఎంపీలకు ఇంకా ఎక్కువ ఇచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు కూడా ఆమోదం లభించాల్సి ఉంది, అందుకే ఆ ధర పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ డబ్బు కోసం తమను తాము వేలం వేసుకున్నారని చెప్పారు.